
సాక్షి వరంగల్

శుక్రవారం । 15 । మార్చి । 2024



పోస్టు..వేస్ట్

రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలో అనేక పోస్టులు వేస్ట్ అవుతున్నాయి. యాజమాన్యం మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విద్యుత్ ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి.

- IIలో▸



ఆదాయం పైపైకి..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆదాయం ఈఏడాది పెరుగుతోంది. ఈసారి టార్గెట్ చేరుతామని అధికారులు ధీమాతో ఉన్నారు.

- IVలో▸

గరిష్టం/కనిష్టం

$37^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు వేడి తక్కువగా ఉండే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు



కరీమాబాద్ : కలెక్టర్ పి.ప్రావీణ్యను గురువారం టీఎన్జీవోస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి నూతనంగా రూపొందించిన డైరీని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉపయోగపడే జీఓలు, నియమ నిబంధనలతోపాటు సర్వీస్ రూల్స్ తదితర సమాచారం డైరీలో అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, నాయకులు వేణుగోపాల్, హేమానాయక్, సదానందం, రాజు, దుర్గారావు, రాజేష్, సునీతానాయర్, నూతన్, సందీప్, శ్వేత, గణేష్, రాజు, మధుచంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జూడోలో రాణించాలి : డీవైఎస్‌ఓ



కాశిబుగ్గ : క్రీడాకారులు జూడోలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా యువజన, క్రీడల అధికారి(డీవైఎస్‌ఓ) సత్యవాణి సూచించారు. ఓ సిటీ ఇండోర్ స్టేడియంలోని ఖేలో ఇండియా జూడో సెంటర్‌లో గురువారం నూతన జూడో మ్యాట్‌లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ జూడోలో రాణిస్తే గుర్తింపు వస్తుందన్నారు. కోచ్‌లు చెప్పిన విధంగా సాధన చేయాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జూడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కైలాస్‌యాదవ్, నాగరాజు, కోచ్ లింగమూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




సంగెం: జాతీయస్థాయి ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాపులకనిపర్తి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కిజామి ఫౌండేషన్, మాస్టర్ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన హారిక, భవాని, కావ్య, మహేష్ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. గురువారం లయన్ రామచందర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, పీఈటీ కవిత, ఉపాధ్యాయులు అభినందించారు. స్పందన, చింటు, రక్షిత, అనురాధ, ధనేశ్వరి, జ్యోత్స్న, జ్యోతి, వినయ్, ప్రశాంత్, సాహిత్యకు సర్టిఫికెట్లను అందజేశారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి



గీసుకొండ : సహకార వ్యవస్థ బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల డీసీసీబీ నూతన బ్రాంచ్‌ని రెడ్డిపాలెంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార వ్యవస్థ బలంగా ఉంటే రైతులు సంతోషంగా ఉంటారని తెలిపారు. రైతులు, మహిళలు బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. డీసీసీబీ డైరెక్టర్, మొగిలిచర్ల సొసైటీ చైర్మన్ దొంగల రమేశ్ సొసైటీ అభివృద్ధి కోసం చేసిన సేవలను పలువురు కొనియాడారు. డీసీఓ సంజీవరెడ్డి, బ్యాంకు సీఈఓ వజీర్ సుల్తాన్, డీసీసీబీ డిప్యూటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ మనోహర్, డైరెక్టర్లు చెట్టుపల్లి మురళి, రమేశ్, గోపాల్‌రావు, శ్రీనివాస్, నరేందర్, రవిరాజు పాల్గొన్నారు.

ఓవర్ టు ఢిల్లీ..!



- హస్తినకు చేరిన 'అరూరి' వ్యవహారం
- ఫైనల్‌గా బీజేపీలో చేరేందుకు రమేశ్ నిర్ణయం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డైరెక్షన్‌లో చేరిక ఎపిసోడ్
- అయితే నేడు హైదరాబాద్‌లో.. లేదంటే రేపు ఢిల్లీలో..
- బుధవారం ఘటన తర్వాత గోప్యంగా ఉంచుతున్న కమల దళం
- వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అరూరి?.. 24 గంటల్లో సస్పెన్స్‌కు తెర..

సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పొలిటికల్ ఎపిసోడ్ ఢిల్లీకి మారింది. సుమారు నెల రోజుల నుంచి ఆయన పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతుండగా.. బీఆర్‌ఎస్ అధిష్టానం పలుమార్లు బుజ్జగించే ప్రయత్నం చేసింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు.. రమేశ్‌తో మాట్లాడినప్పుడల్లా పార్టీ మారడం లేదంటూ ఖండిస్తూ వచ్చారు. అయితే బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ సీటు ఆయన ఆశిస్తున్నారని తెలిసినప్పటికీ కడియం కావ్య పేరును తెరపైకి తేవడంపై కినుక వహించిన అరూరి రమేశ్ మంగళవారం హైదరాబాద్ ఐటీసీ కాకతీయలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలవడం కలకలం రేపింది. ఈక్రమంలో బుధవారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని స్వగృహంలో ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడించేందుకు రమేశ్ సిద్ధం కావడం.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఇతర నాయకులు తమ వాహనాల్లోకి ఎక్కించుకుని హైదరాబాద్‌కు తీసుకెళ్లి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కల్పించిన సంగతి తెలిసిందే. అదేరోజు ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలతో మాట్లాడిన కేసీఆర్.. కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఈసందర్భంగా తనను ఎవరూ తీసుకెళ్లలేదు.. బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని ప్రకటించిన అరూరి.. గురువారం ఉదయం నుంచి బీజేపీ అగ్రనేతలతో కలిసి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మల్కాజ్‌గిరి రోడ్‌షోలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వస్తున్న పీఎం మోదీ సమక్షంలో శుక్రవారం లేదా ఢిల్లీకి వెళ్లి బీజేపీలో చేరుతారనే ప్రచారం ఉమ్మడి వరంగల్‌లో చర్చనీయాంశంగా మారింది.

బీఆర్‌ఎస్ ప్రయత్నాలు విఫలం!

మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వ్యవహారంలో నేడు కీలక పరిణామం చోటుచేసుకోనున్నట్లు అనుచరవర్గం చర్చించుకుంటోంది. గురువారం ఉదయం నుంచి బీజేపీలో చేరేందుకు ఆయన ఢిల్లీ వెళ్లారని, ఇందుకు చేసిన ప్రయత్నాలు చివరి దశకు చేరాయన్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డైరెక్షన్‌లో రమేశ్ రాష్ట్ర నాయకులతో కలిసి ఢిల్లీకి వెళ్లారన్న ప్రచారం ఒకటి కాగా.. కిషన్‌రెడ్డి సూచనల మేరకు హైదరాబాద్‌లోనే కీలక నేతలతో కలిసి ఉన్నారని మరో ప్రచారం సాగింది. బుధవారం అరూరి ప్రెస్‌మీట్ ఏర్పాటు సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇటు రమేశ్, ఆయన వర్గీయులు.. అటు బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఈ విషయంలో ఏం మాట్లాడడం లేదు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాలో పలు రకాల వార్తలు షికార్లు చేసినా.. అరూరి ఎపిసోడ్‌లో ఏం జరుగుతుందనేది అత్యంత గోప్యంగా ఉంచారు. ఇదిలా ఉండగా.. అరూరి రమేశ్ గురువారం ఉదయం నుంచే బీఆర్‌ఎస్ నాయకత్వం, సహచర నేతలకు టచ్‌లో లేరని, సెల్‌ఫోన్ కూడా పని చేయడం లేదని అనుచరులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో.. బీజేపీ వరంగల్ టికెట్ నూరుశాతం ఖాయం చేసుకున్న రమేశ్.. నేడు హైదరాబాద్‌లో మోదీ సమక్షంలో.. లేదంటే రేపు ఢిల్లీలో అగ్రనేతల సమక్షంలో ఆపార్టీలో చేరుతారన్న ప్రచారం గురువారం రాత్రి నుంచి జోరందుకుంది.

ఆసక్తికరంగా ఓరుగల్లు రాజకీయాలు

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో వరంగల్‌లో ఆసక్తికర రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో రోజుకోతీరుగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. నిన్నమొన్నటి దాకా రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్న ఓరుగల్లు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఆ పార్టీని వీడుతుండడం కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తోంది. పార్టీ నుంచి బయటకు వెళ్లే నేతలను బుజ్జగించినా కొనసాగే పరిస్థితి కానరావడంలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ స్థానాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వలేదు. అందులో ఒకరైన స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సుమారు నెలన్నర క్రితం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులను కలిశారు. మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరగా.. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం వచ్చింది. బీఆర్‌ఎస్‌లో ఉంటూ కీలకపదవులు దక్కించుకున్న వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సైతం ఊహించని విధంగా పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం అగ్రనాయకత్వాన్ని కూడా ఆశ్చర్యపర్చింది. తాజాగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బీజేపీ వైపు చూస్తుండడం బీఆర్‌ఎస్‌ను కుదిపేస్తోంది.

ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. హైదరాబాద్ నుంచి గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినీవిద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూన్ 10లోగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పాఠశాలల్లో వసతుల ఏర్పాట్ల ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారి వాసంతిని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, మెప్మా పీడీ రేణుక తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా అశ్విని తానాజీవాకడే

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌గా అశ్విని తానాజీ వాకడేను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు బదిలీ ఉత్తర్వులు రావడంతో బల్దియా ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ప్రజలకు పౌర సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు.



కలెక్టర్ ప్రావీణ్యకు మొక్క అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీవాకడే

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

కరీమాబాద్ : గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కలెక్టర్ పి.ప్రావీణ్యను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. కమిషనర్‌కు కలెక్టర్ ప్రావీణ్య శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సాధికారత సాధించాలి

- మహిళా దినోత్సవంలో డీఆర్‌డీఓ కౌసల్యదేవి

వరంగల్ : మహిళలు హక్కులను సద్వినియోగం చేసుకొని, సాధికారత సాధించాలని డీఆర్‌డీఓ కౌసల్యదేవి సూచించారు. డీఆర్‌డీఏలోని సమావేశ మందిరంలో రాణి రుద్రమదేవి జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, సెర్ప్ సిబ్బంది సలహాలు సూచనలతో జీవనోపాధి పెంపొందించడం అభినందనీయమని కొనియాడారు. మహిళలు ప్లాస్టిక్ నిర్మూలనకు కృషిచేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాలుపడాలని పిలుపునిచ్చారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద, గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామాల నుంచి బెస్ట్ ఎంటర్‌టైనర్లుగా నిలిచిన మోడెం కవిత, సరోజనను ఘనంగా సత్కరించి ప్రశంసపత్రాలను అందజేశారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, అడిషనల్ డీఆర్‌డీఓ రేణుకాదేవి, డీపీఎంలు సరిత, భవాని, నీలవేణి, అనిత, ఆర్‌ఎం సైదిరెడ్డి, ఓఎంఎస్ అధ్యక్షురాలు అరుణ, ఏపీఎంలు సురేష్, ప్రేమ్‌రాజ్, సుధాకర్, ధర్మేందర్, సీసీలు గడ్డి అశోక్, గోలి కొమురయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కౌసల్యదేవి

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పర్వతగిరి : ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమారం వరకు రూ.80 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులు, చింతనెక్కొండలో రూ.3 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, రూ.25 లక్షలతో సోమారం గ్రామ పంచాయతీ భవనానికి, రూ.5లక్షలతో కల్లెడలో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దౌలత్‌నగర్ గ్రామంలో రూ.18 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల పరిసరాలను పరిశీలించి ఆయన మాట్లాడారు. మరుగుదొడ్లు, ప్రహరీ, విద్యుత్, నీటి సమస్యను సత్వరమే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సింగ్‌లాల్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్, భాస్కర్‌నాయక్, అనిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

బాధితులకు అండగా ఉంటా..

మండలంలోని చెరువుకొమ్ముతండాలో కొద్ది రోజుల క్రితం షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లు కాలిపోయిన బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బాధితులను గురువారం పరామర్శించి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.3లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

జాతరను విజయవంతం చేయాలి

- సమీక్షలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : కొమ్మాలలో ఈ నెల 25న నుంచి ప్రారంభంకానున్న లక్ష్మీనర్సింహస్వామి జాతరను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. జాతర పనులపై గురువారం ఆయన ఆలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు చోట్ల మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు ఆలయ ప్రధాన రహదారిలో మొరం పోసి చదును చేసే పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆలయంతోపాటు జాతర ప్రాంగణంలో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే రెండు బోర్లు వేయించామని, ఇంకా ఆలయ సమీపంలోని గ్రామాల నుంచి ట్యాంకులతో నీటిని అందించాలని సూచించారు. ఆలయ సింహద్వారం వద్ద కొత్తగా బోరు వేయించాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మామునూరు ఏసీపీ తిరుపతి, ఎంపీపీ భీమగాని సౌజన్య, తహసీల్దార్ రియాజుద్దీన్, ఈఓ శేషగిరి, గీసుకొండ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, ఎస్సైలు వెంకన్న, జానీపాషా, ఎంపీడీఓ కృష్ణవేణి, పీఆర్ డీఈ జ్ఞానేశ్వర్, ఏఈలు సుధాకర్, వెంకటేశ్, విద్యుత్ శాఖ డీఈ నర్సింహారావు, సంపత్‌రెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, కాంగ్రెస్ నాయకుడు చాడ కొమురారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొమ్మాల ఆలయంలో సమీక్ష నిర్వహిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



వాదనకు దిగిన కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం..

సమీక్ష అనంతరం కాంగ్రెస్ నాయకులు పరస్పరం వాగ్వాదానికి దిగారు. జాతర కమిటీ ఎప్పుడు వేస్తారని, కమిటీలో లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వాలని గొడవపడ్డారు. చిట్టీలు వేసుకుని నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే సూచించినా ఎవరూ వినడం లేదని, ఈసారి కమిటీ ఉంటుందో లేదో తెలియడం లేదని కొందరు నాయకులు వాపోయారు. జాతర పనులను కొందరికే ఇచ్చారని, తాము స్థానికంగా ఉన్నా పనులు ఇవ్వడం లేదంటూ కొందరు ఎమ్మెల్యేకు తమ వాదన వినిపించారు.

పర్యావరణాన్ని కాపాడాలి : డీఈఓ

కాశిబుగ్గ సెంటర్ : పర్యావరణాన్ని కాపాడాలని డీఈఓ వాసంతి సూచించారు. వరంగల్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జిల్లాస్థాయి ఎన్జీసీ సైన్స్ డ్రామా, ఏకపాత్రాభినయం పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడుతాయని అన్నారు. జీవవైవిధ్యం, పర్యావరణంపై అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్జీసీ, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ సూచనల మేరకు 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు' అంశంపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సైన్స్ డ్రామా పోటీల్లో మొదటి స్థానం నెక్కొండ టీఎస్ఆర్ఎస్, రెండో స్థానం ఖానాపురం కేజీబీవీ, మూడో స్థానంలో నల్లబెల్లి కేజీబీవీ నిలిచాయి. ఏకపాత్రాభినయం పోటీల్లో మొదటి స్థానం నెక్కొండ ఎంజేపీ, రెండో స్థానం చెన్నారావుపేట మండలం లింగపురం జెడ్పీహెచ్‌ఎస్, మూడో స్థానంలో శంభునిపేట ప్రభుత్వ పాఠశాల నిలిచిందని ఆయన తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలకు డీఈఓ వాసంతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా రహమాన్, రవీందర్, అనుపమ, సుమలత, అనంతగిరి వ్యవహరించారు. ఎన్జీసీ కోఆర్డినేటర్ విద్యాసాగర్, జిల్లా సైన్స్ విషయ నిపుణులు సురేష్‌బాబు, కృష్ణ, శ్రవణ్, పరమేశ్వర్ పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి నగదు, ప్రశంసపత్రం అందజేస్తున్న డీఈఓ వాసంతి

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

గీసుకొండ : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. వెంకటరమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల తీరును పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ నేహా, సీహెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధార్‌సింగ్ పీహెచ్‌సీతో పాటు కొనాయమాకుల, రాంపురం గ్రామాలను సందర్శించారు. ఈ రెండు గ్రామాలు టీబీ రహిత గ్రామాలుగా ఆయన గుర్తించారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

గంగదేవిపల్లిని సందర్శించిన కర్నూలు జిల్లా వాసులు



కర్నూలు జిల్లా వాసులతో జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి

గీసుకొండ : జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో ఉన్న పది గ్రామాల నుంచి 48 మంది కమ్యూనిటీ డెవలప్‌మెంట్ లీడర్లు, సిబ్బంది గురువారం సందర్శించారు. రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజ్ఞాన యాత్రలో భాగంగా వారు గ్రామ సందర్శనకు వచ్చారు. జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వారికి గ్రామ అభివృద్ధి గురించి వివరించారు. ట్రస్ట్ డైరెక్టర్ రామేశ్వరి, ఏటీఎల్ రెహానా, ట్రైనర్లు నరసింహులు, శ్రీనివాసులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు నాగలక్ష్మి, ఓబులేశు, రామాంజనేయులు పాల్గొన్నారు.

సందర్శించిన ఏపీ అంబుడ్స్‌మన్ అధికారులు

గంగదేవిపల్లిని ఏపీ అంబుడ్స్‌మన్ (డీఆర్‌డీఏలో పని చేసే) అధికారులు సందర్శించారు. హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీ శిక్షణలో భాగంగా గ్రామంలో ఈజీఎస్ పనులు, సామాజిక తనిఖీ విధానాన్ని పరిశీలించారు. సామాజిక తనిఖీ ఎస్‌పీఎం జెట్టి తిరుపతి, ఎస్ఆర్‌పీ సురేష్, ఏపీఓలు చంద్రకాంత్, మోహన్‌రావు, ఈసీ శ్రీలత, టీఏ సుష్మ, ఎఫ్ఏ గోపి, డీఆర్‌పీ అనిల్ పాల్గొన్నారు.

మార్కెట్‌ను ముంచెత్తిన మిర్చి



వరంగల్ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

- రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన మిరప
- విక్రయానికి 80వేలకు పైగా బస్తాలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఈసీజన్‌లో రెండు తెలుగురాష్ట్రాల పరిధి నుంచి మిర్చి తరలి వస్తోంది. రెండో కోత పూర్తవుతున్న సమయంలో గురువారం సుమారు 80వేల బస్తాలకు పైగా మిర్చిని రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చారు. యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే కనిపిస్తున్నాయి. పెద్ద ఎత్తున్న మిర్చి రావడంతో ధరలు పడిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. తేజ రకం ధర క్వింటాకు గరిష్టంగా రూ.20,100, కనిష్టంగా రూ.14,500, యూఎస్–341 రకం గరిష్టంగా రూ.17వేలు, కనిష్టంగా రూ.13,500, వండర్‌హాట్ గరిష్టంగా రూ.18వేలు, కనిష్టంగా రూ.14వేలు పలికింది. మిగిలిన దీపిక, దేశీ, సింగల్ పట్టీ రకాలు తక్కువ మొత్తంలో మార్కెట్‌కు వచ్చాయి. మన రాష్ట్రానికి అనుకుని ఉన్న కర్ణాటక నుంచి రైతులు బాడిగ రకం మిర్చిని వరంగల్ మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తున్నారని, ధరలు తక్కువగా ఉంటే కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టుకుంటున్నారని ట్రేడర్స్ తెలిపారు. గురువారం వచ్చిన మిర్చి తూకాలు రాత్రి వరకు కూడా కొనసాగిస్తున్నట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

విద్యారణ్యపురి: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా డీఎస్సీకి ప్రిపేరవుతున్న వంద మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హనుమకొండలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ శాఖ గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్మోహన్ తెలిపారు. ఈనెల 26 వరకు టీఎస్ స్టడీసర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు శిక్షణ ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు డైట్, బీఈడీ, టెట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, టెట్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు.

రేపు కమిషనరేట్ పరిధిలో మెగా జాబ్ మేళా

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి నిరుద్యోగ యువతకు ఈనెల 16న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో టీఎంఐ ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో నగరంలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 నుంచి నిర్వహించే జాబ్ మేళాలో వివిధ కంపెనీల్లో సుమారు 3వేలకు పైగా ఉద్యోగాలకు నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కనీస అర్హత పదో తరగతి పాసై ఉండాలని, జాబ్ మేళాలో పాల్గొనే వారు ముందు bit.y/jm-gorm సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: బీసీ గురుకుల కళాశాల కరుణాపురం(బాలుర)లో ఈఏపీసెట్, నీట్ షార్ట్ టర్మ్ కోచింగ్ ఇచ్చేందుకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో బోధన చేపట్టేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మనోహర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఈనెల 18న కరుణాపురంలోని బీసీ గురుకులానికి హాజరుకావాలన్నారు.

యువతికి లైంగిక వేధింపులు

ఖిలా వరంగల్: ఓ గ్రామానికి చెందిన యువ నాయకుడు తనను లైంగికంగా వేధించాడని నగరానికి చెందిన ఓ యువతి మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పెళ్లి చేసుకుంటానని కొద్ది కాలంగా నమ్మిస్తూ మోసం చేశాడని ఆ యువతి ఫిర్యాదు చేయగా బుధవారం రాత్రి కేసు నమోదైనట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రైవేట్ పాఠశాలలకు పంపించం..

బచ్చన్నపేట : మండలంలోని రామచంద్రాపురం గ్రామ విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు పంపించమని గ్రామస్తులు గురువారం తీర్మానం చేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించగా ఈ తీర్మానం చేశారు. అనంతరం గ్రామస్తుడు హరీష్‌రెడ్డి తన తాత హనుమారెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం శ్యామ్‌మోహన్‌రాజ్, రిటైర్డ్ హెచ్‌ఎం ప్రభాకర్, టీచర్లు అయిలయ్య, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

పోస్టు.. వేస్టు

వినియోగించుకోని టీఎస్ ఎన్పీడీసీఎల్

- 24 విభాగాల్లో 215 పోస్టులు ఖాళీ
- వెరసి క్షేత్ర స్థాయిలో సిబ్బంది కరువు
- ఇతర పోస్టులుగా మార్చి వినియోగంలోకి తీసుకురావాలని సంఘాల డిమాండ్

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలో అనేక పోస్టులు వేస్ట్ (మురిగిపోతున్నాయి) అవుతున్నాయి. వీటిని ప్రత్యామ్నాయ పోస్టులుగా మార్చి వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నా యాజమాన్యం మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తోందని విద్యుత్ ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి. గత పాలకవర్గం కసరత్తు చేసినట్లు కనిపించినా తర్వాత పూర్తిగా వదిలేసింది. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డుగా ఉన్నప్పుడు మంజూరైనా పోస్టులనే ఇప్పటికీ భర్తీ చేస్తున్నారే కాని కొత్త పోస్టులను సృష్టించడం లేదని ఉద్యోగ సంఘాలు గుర్రుగా ఉన్నాయి. ఏపీ విద్యుత్ బోర్డు ఉన్నప్పటి నుంచి విద్యుత్ బోర్డు మూడు విభాగాలుగా.. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలుగా ఏర్పాటు అయ్యాయి. అయితే ప్రస్తుతం విద్యుత్ సర్వీస్‌ల సంఖ్య గణనీయంగా పెరిగాయి. విద్యుత్ సబ్ స్టేషన్‌లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, వినియోగదారుల సంఖ్య రెట్టింపు కంటే అదనంగా పెరిగాయి. అయినా క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు అందుబాటులో ఉండాల్సిన పోస్టులను ఇప్పటికీ పెంచలేదు. యాజమాన్యంగా ఇంజనీర్లు మాత్రమే ఉండడంతో ఆ యాజమాన్యాలు కొత్తగా ఇంజనీర్ల పోస్టులు మాత్రమే పెంచి.. క్షేత్ర స్థాయిలో వినియోగదారుల ముంగిట సేవలు అందించే జూనియర్ లైన్‌మెన్, లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్ వంటి పోస్టులు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఎప్పుడో మంజూరైన కొన్ని పోస్టులు వినియోగంలో లేకుండా పోయాయి. వీటిని క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు సేవలందించే పోస్టులుగా తర్జమా చేసే అవకాశం ఉన్నా యాజమాన్యం ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని విద్యుత్ ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి.

వృథాగా 24 రకాల పోస్టులు

టెలిఫోన్ బాయ్, స్టోర్ కీపర్, కార్పెంటర్, గస్‌మాన్, వెల్డర్ కమ్ మిక్సర్, గ్రౌండ్ పంపు ఆపరేటర్, జేఎండీ, క్లీనర్ లష్కర్ వంటి మొత్తం 24 రకాల పోస్టులు వృథాగా ఉన్నాయి. 24 రకాల



పోస్టులు ఎన్పీడీసీఎల్ మొత్తంలో 215 వరకు ఖాళీగా వినియోగంలో లేకుండా పోయాయి. ఇలాంటివి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎస్పీడీసీఎల్)లో 190 పోస్టులను ఇతర పోస్టులుగా మార్చి వినియోగంలోకి తీసుకువచ్చారు. జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా, ఫోర్‌మెన్ గ్రేడ్-1, ఫోర్‌మెన్ గ్రేడ్-2, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్ ఇన్స్‌పెక్టర్, లైన్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులుగా మార్పు చేశారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో మాత్రం యాజమాన్యం చోద్యం చూస్తోంది. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో 72, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 75, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 14, ఉమ్మడి నిజామాబాద్ 21, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 33 పోస్టులు మొత్తం 215 పోస్టులు అన్ యూజ్డ్‌గా ఉన్నాయి. ఇందులో స్టోర్ కీపర్ మూడు రకాల గ్రేడ్‌లో 80, సివిల్ మేస్త్రీ 23 పోస్టులు, ఎస్ఎస్ఏ/ఎస్‌బీటీ పోస్టులు 18, ఎల్ఎండి 12, జేఎండీ 21, క్లీనర్ 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ యూజ్డ్‌గా ఉన్నా పోస్టులను ఆపరేషన్, మెయింటెనెన్స్, ఈఆర్‌టీ విభాగంలో వివిధ పోస్టులుగా మార్చి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని విద్యుత్ ఉద్యోగ సంఘాలు కోరాయి.

'స్పాట్'కు సర్వం సిద్ధం..

రేపటి నుంచి ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ

- నాలుగు దశల్లో ప్రక్రియ..
- ఉమ్మడి జిల్లా కేంద్రానికి చేరుకున్న ఇంటర్మీడియట్ జవాబుపత్రాలు

విద్యారణ్యపురి : ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు ముగిశాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి స్పాట్ వాల్యూయేషన్(మూల్యాంకనం) ప్రక్రియ నిర్వహించబోతున్నారు. మొత్తం నాలుగు దశలో వివిధ సబ్జెక్టు జవాబుపత్రాల వాల్యూయేషన్ ప్రక్రియ కొనసాగనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఈ క్యాంపునకు వివిధ సబ్జెక్టుల జవాబుపత్రాల 6లక్షల 20వేల వరకు చేరుకున్నాయి. ఈ క్యాంపు ఆఫీసర్‌గా హనుమకొండ జిల్లా డీఈఐఓ ఎ గోపాల్, ఏసీఓ జనరల్-1గా హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర వ్యవహరిస్తున్నారు.

ఈనెల16 నుంచి మొదటి దశ

ఈనెల 16వ తేదీనుంచి మొదటి దశ స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ ప్రారంభం కాబోతుంది. ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల జవాబుపత్రాల వాల్యూయేషన్ జరగబోతుంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకుల కళాశాలల నుంచి 1196మంది అధ్యాపకులను అసిసెంట్ ఎగ్జామినర్లు(ఏఈ) వాల్యూయేషన ప్రక్రియలో భాగస్వాములు కాబోతున్నారు.ఏసీఓలు 30మందిని నియమించారు.ఐదుగురు ఏఈలకు ఒక్కో చీఫ్ ఎగ్జామినర్‌ను నియమించనున్నారు.

20 నుంచి రెండోదశ..

ఈనెల 20వ తేదీ నుంచి రెండోదశ స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ జరగనుంది. ఇందులో ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల జవాబుపత్రాలు స్పాట్ వాల్యూయేషన్ జరగనుంది.

22 నుంచి మూడో దశ

మూడో దశలో కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టుల జవాబుపతాల స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ ప్రారంభంకానుంది. ఈనెల 22వ తేదీ నుంచి ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు.

24 నుంచి నాలుగో దశ

నాలుగో దశలో హిస్టరీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టు ల జవాబుపత్రాల వాల్యూయేషన్ జరగనుంది. ఈ ప్రక్రియ ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా ఇంటర్ బోర్డు నియమించిన అధ్యాపకులంతా తప్పనిసరిగా వాల్యూయేషన్ ప్రక్రియకు హాజరుకావాల్సి ఉంటుంది. లేని పక్షంలో చర్యలు తప్పవని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

మన సహకార వ్యవస్థ దేశానికే ఆదర్శం

- జాతీయ సహకార బ్యాంకుల సమాఖ్య చైర్మన్ రవీందర్‌రావు
- కమలాపూర్‌లో పీఏసీఎస్ కార్యాలయం ప్రారంభం



పీఏసీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

కమలాపూర్: తెలంగాణ రాష్ట్ర సహకార వ్యవస్థ దేశానికే ఆదర్శమని జాతీయ సహకార బ్యాంకుల సమాఖ్య చైర్మన్, తెలంగాణ రాష్ట్ర సహకార అఫెక్స్ బ్యాంక్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.కోటి వెచ్చించి కొనుగోలు చేసిన భవనంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సహకార వ్యవస్థ ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందని, గత ప్రభుత్వంలో కేసీఆర్ అందించిన ప్రోత్సాహంతోనే సహకార వ్యవస్థ ఇంత అభివృద్ధి చెందిందన్నారు. సహకార సంఘాల పని తీరును నీతి ఆయోగ్ గుర్తించిందని, రెండున్నరేళ్ల క్రితం భారత ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందన్నారు. సహకారంలో రాజకీయం లేదని, సంఘ సభ్యులు, రైతులు, సామాన్యుల ప్రయోజనాల కోసమే సహకార వ్యవస్థ పని చేస్తుందన్నారు. అందరి సహకారంతో కరీంనగర్ బ్యాంకును దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దామన్నారు. రాబోయే కాలంలో సంఘం ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నారన్నారు. తన పదవీ కాలం ఉన్నంత వరకు సహకార సంఘాల అభివృద్ధి, గూడూరులో సంఘం ఆధ్వర్యంలో ఐదెకరాల స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, కమలాపూర్, ఎల్కతుర్తి పీఏసీఎస్ చైర్మన్లు పేరాల సంపత్‌రావు, రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు రమేష్‌బాబు, సత్యనారాయణరావు, రాజేశ్వర్‌రావు, సురేందర్, శ్రీనివాస్, ఎడ్వర్డ్, సీఈఓ చోటే మియా, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి, డైరెక్టర్ కృష్ణప్రసాద్, మాసీ ప్రజాప్రతినిధులు సాంబరావు, సంపత్‌కుమార్, రమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : పోక్సో కేసులో నేరం నిరూపణ కాబడిన ఒకరికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ గురువారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి జటంగి రాజు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైన ఘటనలో సదరు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సిరిసిల్ల అశోక్ 2017 మే 30వ తేదీన కేసు నమోదు చేశారు. ఆ వెంటనే అప్పటి సీఐ (ప్రస్తుత ఖమ్మం ఏసీబీ డీఎస్పీ) వై.రమేష్ విచారణ ప్రారంభించి నిందితుడిని పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా ఇల్లందు మండలానికి చెందిన పల్లపు శివగా గుర్తించిన అనంతరం అప్పటి డీఎస్పీ (ప్రస్తుత ఖమ్మం అడిషనల్ ఎస్పీ) ఆంగోత్ నరేష్ కుమార్ పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు ద్వారా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన స్పెషల్ పోక్సో కోర్టు పీపీ కీసర పద్మాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ప్రస్తుత మహబూబాబాద్ డీఎస్పీ ఎస్.తిరుపతి రావు పర్యవేక్షణలో ఐపీఎస్ అధికారి, బయ్యారం ఎస్‌హెచ్‌ఓ చేతన్ నితిన్, సీఐ బి.రవికుమార్, ఎస్సై జి.ఉపేందర్, కోర్టు లైజనింగ్ అధికారి, ఎస్సై బాణాల వెంకటాచారి, భరోసా కేంద్రం లీగల్ అడ్వైజర్ సాహితీ ఆధ్వర్యంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణకాబడిన పల్లపు శివకు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

కాంగ్రెస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

- ఓ కేసు విషయంలో అరెస్టు చేసేందుకు వచ్చిన బాపట్ల పోలీసులు
- వారితో వెళ్లడానికి నిరాకరించి ఈ ఘాతుకానికి పాల్పడిన వైనం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమేష్

కురవి: కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా కురవి మండల నాయకుడు బానోత్ రమేష్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ బయట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్యతండా జీపీ పరిధి పిల్లిగుండ్ల తండాకు చెందిన కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐలో పనిచేస్తున్న బానోత్ రమేష్ ఇంటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లకు చెందిన పోలీసులు ఓ కేసు విషయంలో ఉదయం వచ్చారు. అకౌంట్‌లో రూ.2లక్షలు జమ అయిన విషయమై మాట్లాడాలి.. వెంట రావాలన్నారు. దీంతో తాను తర్వాత వస్తానని రమేష్ చెప్పగా, వారు వినకుండా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో రమేష్ తన కారులో పోలీసులు, కుటుంబసభ్యులతో కలిసి కురవి పీఎస్‌కు వచ్చారు. కేసు విషయమై బాపట్ల పోలీసులు ఎస్సై గోపికి వివరించి అతడిని తీసుకెళ్లడానికి మరోమారు యత్నించారు. స్టేషన్ నుంచి బయటకు వస్తున్న క్రమంలో రమేష్ తన భార్య వద్ద ఉన్న పురుగుల మందు డబ్బా తీసుకుని మందు తాగాడు. గమనించిన పోలీసులు అతడి కారులోనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై కురవి ఎస్సై బి.గోపిని వివరణ కోరగా బానోత్ రమేష్‌ను ఓ కేసు విషయంలో బాపట్ల పోలీసులు తీసుకెళ్లేందుకు వచ్చారని, వారితో వెళ్లడానికి నిరాకరించి కురవి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని పేర్కొన్నారు. ఈ క్రమంలో పురుగుల మందు తాగాడని వివరించారు.

Nagarjuna కావలెను
వరంగల్, హన్మకొండ, నర్సంపేట, జనగాం, మహబూబాబాద్, తొర్రూర్, పాలకుర్తి, మడికొండ, పరకాల, భూపాలపల్లి, ములుగు, మహదేవ్‌పూర్ మరియు ఇతర ప్రాంతాలలో నాగార్జున పాలు మరియు పాల పదార్థములు అమ్మకాలు చేయుటకు పార్లర్ ఏజెంట్లు కావలెను.
సంప్ర: 8142823366, 8142613366, 7337441572

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ హన్మకొండ సుబేదారి మెయిన్ రోడ్డులో మంచి కిరాయిలతో ఉన్న G+3 బిల్డింగ్ 355 Sq.yards గల కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును. సెల్: 9866071830, 9502267322. [W-1220899]

PLOT FOR SALE

■ GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును. కేవలం 15,000/- లకు గజం మాత్రమే. వివరాలకు సంప్ర: 9849992488. [W-1264853]

SERVICES

■ హౌస్, ప్లాటు, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. సెల్: 7842279342. [WA-7297]

■ హౌస్, ప్లాటు, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. సెల్: 8790379618. [WA-7298]

VEHICLE FOR SALE

■ AL 3718 IL 260 WB BS4 Model 2019, TS-25-T-3939. Indusind Bank. Contact: 7338745953. [W-1264903]

FINANCE

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1200989]

డాక్యుమెంట్స్ పోయినవి

■ SAMUDRALA KRISHNA, S/o: Rama Chandraiah, H.No.2-8-124/8-A, SaiNagar, Hyderabad Road, Jangaon Town & Dist. నాపేరు పైన రిజిస్టర్ అయిన ఒరిజినల్ ఓపెన్ ప్లాటు డాక్యుమెంట్ నెం. 2416/1999 గలది. నేను బైక్‌పై జనగాం బస్టాండ్‌కు వెళ్ళే దారిలో ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ నెంబర్‌కి తెలుపగలరు. సెల్: 9908557231. [W-1264902]

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787738]

WANTED

■ GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్స్ & LAB టెక్నీషియన్స్ అనుభవం గలవారు కావలెను. సంప్రదించండి: గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్ 12 to 2PM. [WA-0364]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం: 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సాప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233881]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సాప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233886]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీతం: 18k. ఫోన్: 9160900024 / 9640400073. [H-799854]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుదాఘాతంతోనే సంపత్ మృతి

- పరకాల ఏసీపీ కిశోర్ కుమార్



మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్‌కుమార్

దామెర: అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల కారణంగానే సంపత్ మృతి చెందాడని పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. దామెర మండల కేంద్రానికి చెందిన బిజిలి రవి, పోతుల కుమారస్వామి, దామెరుప్పుల ఐలేష్, తాత కొమురయ్య.. పంటచేలల్లో విద్యుత్ తీగలు ఏర్పాటుచేసి అడవి పందులను వేటాడేవారు. ఈ క్రమంలో ఈ నెల 12న పోతుల కుమారస్వామికి చెందిన భూమి వద్ద మునగచేను చుట్టూ విద్యుత్ తీగలు అమర్చి బిజిలి రవి అనే వ్యక్తి అక్కడే నిద్రించాడు. ఇదే సమయంలో దామెర గ్రామానికి చెందిన మేరుగు సంపత్ తన మిత్రుడు పిడిశెట్టి సహోదర్‌తో కలిసి 12న అర్ధరాత్రి కుమారస్వామి చేను వైపునకు వెళ్లాడు. దీంతో చేను చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలు తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇది గమనించిన సహోదర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ, ట్రెయినీ ఐపీఎస్ శుభం నగరాలే కేసు నమోదుచేయగా, సీఐ రంజిత్ కుమార్, ఎస్సై కొంక అశోక్ కేసును ఛేదించారురు. కాగా, అడవి పందుల కోసం విద్యుత్ తీగలు ఏర్పాటుచేసి వ్యక్తి మృతికి కారణమైన బిజిలి రవి, పోతుల కుమారస్వామి, దామెరుప్పుల ఐలేష్, తాత కొమురయ్యను గురువారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. పిడిశెట్టి సహోదర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీ లభించిన తరువాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

'డాక్టర్ సాబ్'కు ఘన వీడ్కోలు



సుధాకర్‌రావు పాడె మోస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



సుధాకర్‌రావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న పొన్నాల, హరీష్‌రావు, దయాకర్‌రావు

- ముగిసిన సుధాకర్‌రావు అంత్యక్రియలు
- పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖుల సంతాపం

పెద్దవంగర: చెన్నూరు (ప్రస్తుత పాలకుర్తి) మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు అంత్యక్రియలు గురువారం ముగిశాయి. అశేష జన వాహిని 'డాక్టర్ సాబ్'కు ఘన వీడ్కోలు పలికింది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలోని తన నివాసం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన సుధాకర్‌రావు అంతిమయాత్ర సాయంత్రం 7 గంటల వరకు సాగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. నెమరుగొమ్ముల ప్రవీణ్‌తో కలిసి సుధాకర్‌రావు పాడెమోశారు. కాగా, సుధాకర్‌రావు చితికి కుమారుడు నెమరుగొమ్ముల వెంకటఅనంతరావు (సంజయ్) నిప్పంటించారు.

ప్రముఖుల నివాళి..

మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు భౌతికకాయాన్ని గురువారం హైదరాబాద్ నుంచి వడ్డెకొత్తపల్లిలోని తన నివాసానికి తీసుకొచ్చారు. ఉదయం 11 గంటల నుంచి ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. అభిమాన నేతను కడసారి చూసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు, అభిమానులు తరలివచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ప్రభుత్వ విప్ జాటోతు రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, శ్రీరాం భద్రయ్య, ధర్మారావు, వరద రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీలు బోడకుంటి వెంకటేశ్వర్లు, బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ జెడ్పీ చైర్మన్ సమ్మారావు, ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జోతిర్మయి, స్థానిక ఎంపీటీసీ ఝాన్సీ, తదితరులు.. సుధాకర్‌రావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సుధాకర్‌రావు వైద్య సేవలు వెలకట్టలేనివి..

డాక్టర్ సుధాకర్‌రావు మృతి రాష్ట్ర ప్రజలకు తీరని లోటని స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఆరోగ్య సేవల్లో చెరగని ముద్ర వేసిన ఆయన సేవలు ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మచ్చ లేని నేత సుధాకర్‌రావు

దేవరుప్పుల: ప్రముఖ వైద్యుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు భౌతికకాయానికి గురువారం యశోద ఆస్పత్రిలో మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, తన్నీరు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య వృత్తి పరంగా, రాజకీయ పరంగా మచ్చలేని నేత సుధాకర్‌రావు అన్నారు.

కోళ్ల పెంపకంతో లాభాలు



కోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కరీమాబాద్: పెరటి కోళ్ల పెంపకంతో లాభాలుంటాయని కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్ అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు గురువారం కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు.. ఇంక్యుబేటర్ వినియోగంతోపాటు కోడి పిల్లల ఉత్పత్తి గురించి వివరించారు. ఇంక్యుబేటర్‌లో కోడి గుడ్లు అమర్చడం, రోజుకు ఎన్నిసార్లు తిప్పాలో తెలిపారు. కోళ్ల పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్నతోపాటు వివిధ గ్రామాలకు చెందని రైతులు, మహిళారైతులు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్య



సాహితి(ఫైల్)

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపూరం(కె) మండల పరిధి ఆలుబాక గ్రామానికి చెందిన ఎంబీఏ విద్యార్థిని సుంక సాహితి(26) గురువారం హైదరబాద్ దిల్ సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆలుబాకకు చెందిన సుంకర వెంకటసుబ్బారావు, కుమారి దంపతుల కూతురు సాహితి మూడేళ్ల క్రితం పైచదువుల కోసం హైదరాబాద్ వెళ్లి అక్కడ హాస్టల్‌లో ఉంటూ ఎంబీఏ చదువుతోంది. ఆమె హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం రావటంతో అక్కడికి వెళ్లారు. వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై హైదరాబాద్ చైతన్యపురి పీఎస్ లో కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

పసుపు సాగుపై అవగాహన



మాట్లాడుతున్న మరియన్న

కేసముద్రం: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో పసుపు పరిశోధన కేంద్రం కమ్మరిపల్లి, నిజామాబాద్ ఆధ్వర్యంలో హెచ్ఆర్ఎస్ మల్యాల సహకారంతో 'పసుపు పంట సాగు, ఆధునిక పద్ధతులు, విలువ జోడింపు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న, పసుపు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు మహేందర్, శ్రీనివాస్, జేవీఆర్ హెచ్ఆర్ఎస్ మల్యాల శాస్త్రవేత్త భాస్కర్.. పసుపు పంట సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కేసముద్రం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆకుల సుధాకర్, గండి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, లక్కాకుల సత్యనారాయణ, కుమారస్వామి, తోట నాగయ్య, రాజశేఖర్, చంద్రం, ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ సంతోష్ పాల్గొన్నారు.

ఎర్రటెండలో చల్లటి ప్రయాణం!





ఓ వైపు మండుతున్న ఎండలు. మరోవైపు ఉచిత బస్సు ప్రయాణం. ఈరెండింటినీ దీటుగా ఎదుర్కొనేందుకు ఓ ఆటో డ్రైవర్ వినూత్నంగా ఆలోచించాడు. ప్రయాణికులను ఆకట్టుకుంటూ, వారికి చల్లదనం, ఆహ్లాదాన్ని అందిస్తున్నాడు మహబూబాబాద్ జిల్లా ఈదులపూసపల్లి గ్రామ శివారు దర్గాతండాకు చెందిన అంజి. ఎండ వేడిమి నుంచి ప్రయాణికులకు ఉపశమనాన్నిచ్చేందుకు ఆటో టాప్‌పై వివిధ గడ్డి జాతి మొక్కలను పెంచుతున్నాడు. ఆటో లోపల నాలుగు బ్యాటరీ ఫ్యాన్లు అమర్చి చల్లని గాలినందిస్తున్నాడు. అతడిని 'సాక్షి' పలుకరిస్తే కష్టమర్లే దేవుళ్లు.. అని అందుకే వారికి ఆహ్లాదకర ప్రయాణాన్ని అందిస్తున్నానని సమాధానమిచ్చాడు.

– మహబూబాబాద్

ఎండు గంజాయి పట్టివేత

- పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్ శివనగర్ వైపు రహదారిపై మిల్స్‌కాలనీ పోలీసులు గురువారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. బ్యాగులను పరిశీలించగా శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించింది. దీంతో సరుకు స్వాధీనం చేసుకుని ఇద్దరిని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు రైలులో తరలించే క్రమంలో ఇద్దరు వరంగల్‌లో దిగినట్లు సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా దర్యాప్తు చేపడుతున్నామని, శుక్రవారం పూర్తి స్థాయిలో కేసు వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేరొందిన ఇన్సురెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే

ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యంలోనే గత డిసెంబర్ 4న రాత్రే ఎస్ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్ రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్ తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేశాడు. ఎస్ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివి ధ రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరా లను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల

ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్‌అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌ఓవెన్, జనరల్ మేనేజర్ కేసన్‌ఫిన్‌లెన్ డెమోస్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు – టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

వీరభద్రుడి పారువేట




ఎడ్ల బండికి స్వాగతం పలుకుతున్న భక్తులు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పారువేట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెనుగొండ అనిల్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి శావలో స్వామివారి ఉత్సవమూర్తిని అధిష్ఠింపజేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం వాహనకారులు శావను మోస్తూ పరుగులు తీశారు. బాదె నాగయ్య ఇంటి వద్దకు చేరుకున్నాక శావకు గ్రామస్తులు, భక్తులు, మహిళలు గుమ్మడికాయలు, టెంకాయలు కొట్టి బిందెలతో నీటిని ఆరబోశారు. ఆలయ ఈఓ సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డిని బజారు నాయకుడు నాగయ్య సన్మానించారు.

నేరడ ఎడ్ల బండికి స్వాగతం..

వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి రాళ్లు మోసిన కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన రుద్రారపు వంశీయుల మూడు జతల ఎడ్ల బండికి ఆలయ ఈఓ సత్యనారాయణ స్వాగతం పలికారు. ఎడ్ల బండికి పూలదండలు వేసిన అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో బండ్లు తిరిగే కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మోహన్‌రావు, బాదె వీరభద్రం, రుద్రారపు వంశీయులు ఉన్నారు.

అండగా ఉంటా.. ఆశీర్వదించండి



నర్సింహులపేటలో మాట్లాడుతున్న ఎంపీ కవిత

నర్సింహులపేట: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని, పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ మాలోతు కవిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మండలస్థాయి సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు రైతుబంధు పూర్తిగా పడలేదని, డిసెంబర్ 7న చేస్తానని చెప్పిన రైతు రుణమాఫీ ఇప్పటి వరకు చేయలేదన్నారు. ఎంపీ ఎన్నికల్లో గెలిపించాలని, సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుకను అవుతానని అన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, మనోధైర్యం కోల్పోవద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడా రు. నిత్యం కార్యకర్తలకు అండగా ఉంటూ సమస్యలను పరిష్కరించే ఎంపీ అభ్యర్థి కవిత, ఆడబిడ్డను ఆశీర్వదించాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేవేందర్, వైస్ ఎంపీపీ జాటోత్ దేవేందర్, నాయకులు సుదీర్‌రెడ్డి, వెంకన్న, జగదీశ్వర్ ఉన్నారు.

ఆదాయం పైపైకి..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు భారీగా రాబడి

- గతేడాది లక్ష్యం రూ.40 కోట్లు.. వచ్చింది రూ.35 కోట్లే
- ఈసారి ఇప్పటికే 34.61 కోట్ల రూపాయల రెవెన్యూ
- మరో 16 రోజులు గడువు ఉండడంతో టార్గెట్ చేరే చాన్స్



సాక్షి, వరంగల్ : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆదాయం ఏడాదికేడాది పెరుగుతోంది. అయితే గతేడాది రూ.40 కోట్ల ఆదాయం లక్ష్యంగా నిర్దేశించగా రూ.35 కోట్లు వచ్చింది. ఈ ఏడాది కూడా ప్రభుత్వం రూ.40 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటికే రూ.34.61 కోట్ల ఆదాయం వచ్చింది. మార్చి నెలాఖరుకు మరో 16 రోజుల సమయం ఉండడంతో ఆ టార్గెట్‌ను దాటుతామని అధికారులు ధీమాలో ఉన్నారు. ఈసారి ఎలాగైనా రికార్డుస్థాయి రెవెన్యూ వస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే రోజురోజుకు మార్కెట్‌కు మిర్చి బస్తాల రాక పెరగడం, మొక్కజొన్నలు, పత్తి వస్తుండడంతో ఫీజుల రూపంలో భారీగానే ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఇంకోవైపు ఫ్రూట్ మార్కెట్, కూరగాయల మార్కెట్ నుంచి ఫీజులు వస్తుండడంతో మహా ఆదాయం వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం వస్తున్న మార్కెట్‌గా రికార్డుల్లోకెక్కింది. ఆ తర్వాత ఖమ్మం, సూర్యాపేటలోని మార్కెట్లు ఉన్నాయని మార్కెట్ కార్యదర్శి సంగయ్య తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది కొన్ని సందర్భాల్లో జీరో దందా జరిగిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మార్కెట్ ఆదాయం కాస్త తగ్గినా.. ఆ తర్వాత నిబంధనలు కఠినతరం చేయడంతో అనుకున్న టార్గెట్ వైపు అధికారులు ముందుకెళ్తున్నారు. అయితే మార్కెట్‌లో అన్ని సక్రమంగా ఉంటే రూ.50 కోట్ల ఆదాయం కూడా వచ్చే అవకాశముందని వివిధ విభాగాల సిబ్బంది పేర్కొనడం గమనార్హం.

అభివృద్ధి.. ఇంకోవైపు ఆదాయం

రాష్ట్రంలోని కొన్ని మార్కెట్లలో పత్తి, మక్కలు, మరికొన్ని మార్కెట్లలో పసుపు, అపరాలు, ఇంకొన్ని మార్కెట్లలో మిర్చి, వేరుశనగ కొనుగోళ్లు మాత్రమే జరుగుతాయి. ఏనుమాముల మార్కెట్‌లో మాత్రం రైతులు పండించే అన్ని రకాల పంటల కొనుగోళ్లు జరుగుతుండడం విశేషం. ఇక మిర్చి కొనుగోళ్లలో ఈ మార్కెట్‌ది నంబర్ వన్ స్థానం. ఇలా రైతుల రాకను బట్టి ఏనుమాముల మార్కెట్‌లో ఇప్పటికే రూ.23 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. వేలం, బ్యాంకు భవనం, టాయిలెట్స్, మెయిన్ బిల్డింగ్ వద్ద వాటర్ ప్రూఫింగ్, వేరుశనగ, పసుపు యార్డుల వద్ద గుమస్తాల అసోసియేషన్ భవనం, వెటర్నరీ ప్రైమరీ హెల్త్ సెంటర్, మార్కెట్ యార్డుకు ప్రహరీ నిర్మాణం, ఎడ్లబండ్ల గేటు, రైతు రెస్ట్‌హౌస్, హాల్, టాయిలెట్స్ పునర్నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేశారు. అయితే అప్పుడప్పుడు వేలంధరతో పాటు ఆ తర్వాత జరిగే క్రయ విక్రయాల మిర్చి, పత్తి ధరల్లో తేడా రావడంతో రైతులు ధర్నా చేసిన ఘటనలు ఉంటున్నాయి. నాణ్యతను బట్టి ధర ఉంటుందని ఇంకోవైపు అధికారులు సర్దిచెప్పడం, నాణ్యత ఉన్న పంటకు ధర వచ్చేలా చూసిన సందర్భాలున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామతో పాటు ఇతర జిల్లాలకు చెందిన రైతులు సైతం తమ పంటలను అమ్ముకునేందుకు వస్తుండడం కూడా మార్కెట్ ఆదాయం పెరిగేందుకు మరో కారణంగా చెప్పవచ్చు. 2019–20లో రూ.25 కోట్లు, 2020–21లో 24 కోట్లు, 2021–22లో రూ.38 కోట్లు, 2022–23లో రూ.35 కోట్లు ఆదాయం వచ్చింది.

ఈ ఏడాది ఆదాయ వివరాలు..

- ఈ ఏడాది ఇప్పటివరకు వచ్చిన ఆదాయం రూ.34.61 కోట్లు. ఈనెల 31వరకు మరో రూ.ఐదు కోట్లకు పైగా రానుంది. అంటే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు ఉన్నాయి.
- గ్రెయిన్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులకు మార్కెట్ ఫీజుల రూపంలో రూ.32.68 కోట్లు ఆదాయం వచ్చింది.
- డైరెక్టు మార్కెట్ ఫీజు (బయట కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులకు చెల్లించిన మార్కెట్ ఫీజు) రూపంలో రూ.91.20 లక్షలు ఆదాయం వచ్చింది.
- ఫ్రూట్‌మార్కెట్ నుంచి రూ.71.89 లక్షల ఆదాయం సమకూరింది.
- కూరగాయల మార్కెట్ నుంచి రూ.29.72 లక్షలు మార్కెట్ ఫీజు రూపంలో వచ్చింది.
- సీసీఐ నుంచి రూ.4.55 కోట్లు, సివిల్ సప్లై నుంచి రూ.1.26 కోట్లు మార్కెట్ ఫీజుల రూపంలో రావాల్సి ఉంది

అధునాతన సౌకర్యాలతో భవనాలు

- టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి

మామునూరు : అధికారులు, సిబ్బంది నివాసాల కోసం అధునాతన సౌకర్యాలతో కూడిన 19 భవనాలను నిర్మించనున్నామని టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. రమేష్ (ఐపీఎస్) ఆధ్వర్యంలో టీఎస్ఎస్పీ బెటాలియన్స్ డీఐజీ ఎంఎస్, సిద్ధిఖి నేతృత్వంలో నిర్మించనున్న 19 భవనాలకు వర్చువల్‌గా టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా శంకుస్థాపన చేశారు. అనంతరం కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడారు. బెటాలియన్ ప్రాంగణం గతంలో చాలా కుటుంబాలతో గ్రామాన్ని తలపించేదని గుర్తు చేశారు. ప్రస్తుత భవనాలను అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్నామని, సిబ్బందికి చాలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 19 భవనాలను మంజూరు చేసిన డీజీపీ రవిగుప్తా, టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా, కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.రమేష్, ఐపీఎస్‌కు కమాండెంట్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏసీ శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్ఐలు శోభన్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, దయాశీల, తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా

వినియోగదారుల రక్షణకు పటిష్ట చర్యలు

- సీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్

ఖిలా వరంగల్: వినియోగదారుల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించి వినియోగదారులకు ఎదురయ్యే మోసాలపై చైతన్య, అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లలో జాగ్రత్త వహించాలన్నారు. అధిక లాభాలు కోసం బీఐఎస్ నిషేధించిన కాడ్మియం, ఇరీడియం, రుతీనియమ్‌లను కలిపి ఆభరణాలు తయారు చేస్తున్నారన్నారు. తద్వారా మహిళల్లో రొమ్ముక్యాన్సర్ , చర్మ వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. ప్రతీ బంగారు వస్తువుకు రసీదు తీసుకుని వెంటనే బీఐఎస్ ఏర్పాటు చేసిన హాల్‌మార్క్ సెంటర్‌లలో పరీక్ష చేయించాలన్నారు. తద్వారా అసలు బంగారం బరువు శాతం తెలుస్తుందన్నారు.

గనులు, భూగర్భశాఖలో బదిలీలు!

- వరంగల్ డీడీ మధుసూదన్ రెడ్డి నిజామాబాద్‌కు..
- ఆయన స్థానంలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఎం.వెంకటేశ్వర్లు
- పలువురు అసిస్టెంట్ డైరెక్టర్‌లకు స్థానచలనం
- హనుమకొండ ఏడీగా వీవీ.సాంబశివరావు

సాక్షిప్రతినిధి, వరంగల్ : గనులు, భూగర్భ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, అసిస్టెంట్ జియాలజిస్టులు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు తదితర హోదాలలో పని చేస్తున్న పలువురు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ(గనులు, భూగర్భ శాఖ) బి.మహేష్‌దత్ ఎక్కా గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న పి.మధుసూదన్ రెడ్డిని బదిలీ చేసి నిజామాబాద్ డీడీగా నియమించారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లుకు డీడీగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, వరంగల్ రూరల్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రవీందర్‌ను నాగర్‌కర్నూల్ ఏడీగా, హనుమకొండ ఏడీ ఎం.నర్సిరెడ్డిని రంగారెడ్డి ఏడీగా బదిలీ చేసి.. ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ ఏడీ వీవీ.సాంబశివరావును నియమించారు. ఆదిలాబాద్ ఏడీ ఎ.రవిశంకర్‌ను వరంగల్ రూరల్‌కు, మెదక్ ఏడీ బి.జయరాజ్‌ను జయశంకర్ భూపాలపల్లి ఏడీగా, మెదక్ ఏడీ జి.విజయకుమార్‌ను జనగామ ఏడీగా బదిలీ చేశారు. అలాగే, వివిధ మైనింగ్ ఏడీ కార్యాలయాల్లో పని చేసే అసిస్టెంట్ జియాలజిస్టులు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసి వేర్వేరు జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ములుగు ఇన్‌చార్జ్ అసిస్టెంట్ జియాలజిస్ట్(ఏజీ) ఇ.లక్ష్మీప్రసాద్‌ను నిర్మల్‌కు, మహబూబాబాద్ ఏజీ ఆర్.రవీందర్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. జనగామ ఏజీ వి.జగన్‌మోహన్‌రెడ్డిని మంచిర్యాల ఏజీగా, మంచిర్యాల ఏజీ ఆర్.బాలును నల్లగొండ ఏజీగా నియమించారు. జయశంకర్ భూపాలపల్లి ఏజీ ఎం.తిరుపతిరావును జగిత్యాల ఏజీగా, మెదక్ ఏజీ జి.విజయకుమార్‌ను జనగామ ఏజీగా నియమించారు. వరంగల్ డీడీ కార్యాలయంలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా విధులు నిర్వర్తిస్తున్న కె.ఆనంద్‌ను నిర్మల్‌కు, నిర్మల్ ఆర్ఐ కె.ప్రతాపరెడ్డిని ఆదిలాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. వరంగల్ రూరల్ ఆర్ఐ జె.మధుసూదన్‌ను నిజామాబాద్ డీడీ కార్యాలయానికి, అక్కడి ఆర్ఐ కె.ఆంజనేయులును కరీంనగర్‌లో నియమించారు. నిజామాబాద్ ఆర్ఐ ఎండీ రైసుద్దీన్‌ను మహబూబాబాద్‌కు, మహబూబాబాద్ శ్రీరాం నరేష్‌ను వరంగల్ డీడీ కార్యాలయంలో ఆర్ఐగా, హనుమకొండ ఏడీ కార్యాలయంలో ఆర్ఐగా ఉన్న ఎం.సురేఖను వనపర్తికి బదిలీ చేసి ఆమె స్థానంలో కొమురంభీమ్ ఆసిఫాబాద్ ఆర్ఐగా వి.చంద్రకళకు పోస్టింగ్ ఇచ్చారు. జనగామ ఆర్ఐ సీహెచ్.రామ్మూర్తిని జయశంకర్ భూపాలపల్లి ఆర్ఐగా నియమించారు.

నెల్లుట్ల మహిళలకు రాష్ట్రస్థాయి పురస్కారాలు

- మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రదానం

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్లకు చెందిన బోనాల కోలాట కళాకారులు బండి రాములమ్మ, గొరిగె నీల రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఉత్తమ అవార్డులను గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా తీసుకున్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన 19 మందికి పురస్కారాలు అందజేయగా జానపద రంగంలో బోనాల కోలాటాలను పునరుద్ధరించడంలో విశేష కృషి చేసిన రాములమ్మ, నీలను పభుత్వం గుర్తించి అవార్డులు అందజేసింది. రూ.లక్ష నగదుతో పాటు మెమోంటో అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల కోలాటంలో ఎన్నో ఏళ్లుగా చేస్తున్న కృషిని ప్రభుత్వ ం గుర్తించడం అభినందనీయమన్నారు. ఎన్నో వర్క్‌షాపుల్లో శిక్షణ ఇచ్చామని, వేలాది కళాకారులను తయారు చేశామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తమ సేవలను గు ర్తించి సముచిత గౌరవం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాములమ్మ, నీల

హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కలిసిన 'బార్' అసోసియేషన్ నాయకులు

వరంగల్ లీగల్ : ఈనెల 16న వరంగల్ ఏసీబీ స్పెషల్ కోర్టు ప్రారంభోత్సవానికి హాజరుకానున్న తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధేని వరంగల్, హనుమకొండ జిల్లా 'బార్' అసోసియేషన్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పత్రిక అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఈ.ఆనంద్‌మోహన్, వై.శ్యాంసుందర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీలు పి.యాకస్వామి, జి.శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధేను ఆహ్వానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు